క్లుప్తంగా

13 నుంచి ముత్తు మారెమ్మ జాతర



నందలూరు(రాజంపేట) : వచ్చే నెల 13 నుంచి నందలూరు రైల్వే కేంద్రంలోని అరవపల్లెలో వెలసిన ముత్తు మారెమ్మ జాతరను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు ఆదివారం తెలిపారు. 13న జాతర, 14 పాలపూజలు ఉంటాయన్నారు. కోవెలలో జాతర ప్రకటన సందర్భంగా చాటింపు నిర్వహించామన్నారు. తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వస్తుంటారు. తమిళుల ఆరాధ్య దైవంగా ముత్తుమారెమ్మను కొలుస్తుంటారు.

మిట్టపల్లెలో నాకాబందీ



గడ్డివామిని తనిఖీ చేస్తున్న పోలీసులు

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టపల్లె గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున సిద్దవటం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని గడ్డివాములు, అనుమానిత ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ జిల్లా శాంతి భద్రతలకు భంగం కల్గించకుండా ప్రశాంతమైన జీవితాన్ని ప్రజలు గడపాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ అన్నారు. ఏఎస్ఐ చంద్రానాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

రాజంపేట : శ్రీకాళహస్తి, బెంగళూరుకు రాజంపేట నుంచి రైల్వేకోడూరు మీదుగా బస్సు సర్వీసు సౌకర్యం కల్పించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, సోషల్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మస్తాన్, సౌత్ ఇండియా ఉపాధ్యక్షురాలు అంకిపల్లె భువనేశ్వర్‌లు డిపో మేనేజరు రమణయ్యను కోరారు. ఆదివారం రాజంపేట డీఎం కార్యాలయంలో డీఎంను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు అంకిపల్లె శివకుమార్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజంగారి యశ్వంతి, జిల్లా మహిళా సెల్ ఇంచార్జ్ సునీత, రైల్వేకోడూరు మహిళ విభాగం అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.

కోదండ రాముడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

ఒంటిమిట్ట : కోదండ రాముడిని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సి. రామచంద్రయ్య ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు, సిబ్బంది ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, టీటీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు పొంగళ్లు



అంకాలమ్మకు పొంగళ్లు పెడుతున్న మహిళలు

రాజంపేట టౌన్ : మండలంలోని తుమ్మల అగ్రహారంలో ఆదివారం ఆ గ్రామ మహిళలు అంకాలమ్మకు పొంగళ్లు పెట్టారు. బలిజపల్లె గంగమ్మకు తుమ్మల అగ్రహారం పుట్టినిల్లు కావడంతో జాతరకు బలిజపల్లెలో అంకురార్పణ చేసే సందర్భంగా అంకాలమ్మకు పొంగళ్లు పెట్టడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. అందువల్ల తుమ్మల అగ్రహారంలోని మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి అంకాలమ్మకు పొంగళ్లు పెట్టి పూజలు జరిపారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది.

'ఎస్సీ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి'

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ వార్డన్‌ను సస్పెండ్ చేయాలని ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్ తెలిపారు. ఆదివారం ఈ విషయమై మాట్లాడుతూ చిన్నమండెంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్ నూరుల్లాబాషా మదనపల్లెలో నివాసం ఉంటూ వారానికి ఒకసారి వస్తూ వర్కర్లకు పెత్తనం ఇవ్వడంతో మెనూ పాటించడంలేదని ఆరోపించారు. ప్రతిరోజు ఉదయాన్నే విద్యార్థులే బయోమెట్రిక్ వేసేలా చూడాలన్నారు. విద్యార్థుల కోసం ఇచ్చే సామగ్రిని ఇవ్వకుండా వార్డెన్ గదిలో ఉంచారన్నారు. వార్డెన్‌పై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్ఎస్ నాయకులు భానుప్రకాష్, శివతేజ, వెంకి పాల్గొన్నారు.

సేవకు సలాం



అత్యవసర సమయంలో అండగా..



పింఛను అందిస్తున్న వలంటీరు పురోహిత్ జోగి

చిట్వేలి సచివాలయం-2 పరిధిలోని వలంటీరు పురోహిత్ జోగి కరోనా సమయంలో ప్రజలకు విశేష సేవలు చేశాడు. మెయిన్‌రోడ్డులో నివాసం ఉండే దివ్యాంగురాలైన సుందరమ్మ అనారోగ్యం బారినపడి చికిత్స కోసం చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చేరింది. ఆస్పత్రిలోనే మూడు నెలలు ఉండిపోయింది. సుందరమ్మ పరిస్థితి తెలుసుకున్న వలంటీరు జోగి చెన్నైలోని ఆస్పత్రి వద్దకు వెళ్లి సుందరమ్మకు మూడు నెలల పింఛను ఒకేసారి అందజేశాడు. కరోనా మహమ్మారి సమయంలో కోవిడ్ కేసులను గుర్తించడంలో ఎంతో సహకరించాడు. బయటి ప్రాంతాల నుంచి ఎవరు వచ్చినా ఆరోగ్య సిబ్బందికి తెలియజేసి కోవిడ్ ట్రాకింగ్‌కు కృషి చేశాడు.

– చిట్వేలి

పింఛను ఇవ్వడం కోసం చెన్నైకి వచ్చాడు



కోవిడ్ సమయంలో నేను అనారోగ్యానికి గురయ్యా. చెన్నైకి వెళ్లి ఓ ఆస్పత్రిలో చేరాను. పింఛను కోసం చిట్వేలికి రాలేని పరిస్థితి నాది. అప్పుడు మా వలంటీరు జోగి నాకు పింఛను ఇచ్చేందుకు చెన్నైకి వచ్చాడు. మూడు నెలల దివ్యాంగుల పింఛను రూ.9 వేలు అందజేసి ఆదుకున్నాడు. అతడికి, వలంటరీ వ్యవస్థ ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి రుణపడి ఉంటా. ఈ సేవలు ఎప్పటికీ కొనసాగాలి. జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి మళ్లీ చూడాలి.

– సుందరమ్మ, మెయిన్ రోడ్డు, చిట్వేలి

ఫోన్ చేసిన వెంటనే స్పందిస్తూ..

ఇతని పేరు జయరాం యాదవ్ రామాపురం మండలంలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. గ్రామంలో తనకు కేటాయించిన కుటుంబాలకు జయరాం సొంత మనిషిగా భావించేలా సేవలు అందిస్తున్నాడు. ప్రభుత్వ పథకాల నుంచి ఇంటి పన్నులు, ధృవపత్రాలు, పలు సేవలకే ఫోన్ చేసి వెంటనే స్పందిస్తూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సేవలు అందిస్తుండడంతో వారికి వలంటీర్‌పై ఎంతో విశ్వాసం. అలాగే కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు దగ్గరుండి ప్రభుత్వ పథకాలను గడప గడపకు చేర్చాడు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయం వ్యవస్థ ఏర్పాటు చేసి దానికి అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థ తీసుకురావడం ఎంత మంచి నిర్ణయమో ఇతనే ఒక ఉదహరణ. జయరాం క్లస్టర్ పరిధిలోని కుటుంబాలకు వలంటీర్‌గా అతను చేసిన సేవలను ప్రశంసిస్తున్నారు.

– రామాపురం



కరోనా సమయంలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ జయరాం యాదవ్(ఫైల్)

పెద్దబిడ్డలా వలంటీర్ ఆదుకున్నాడు



కరోనా లాక్‌డౌన్ సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. మా వలంటీర్ జయరాం యాదవ్ సూరోద్యయం కన్నా ముందే తలుపు తట్టి పింఛన్‌తోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేవాడు. పేద ప్రజల కోసం జగనన్న పథకాలు ద్వారా సాయం అందించాడు. వలంటీర్ చేస్తున్న సేవలు మరవలేం. వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు. ఎప్పటికీ ఈ వ్యవస్థ ఉండాలి.

– అంజనమ్మ, రామాపురం, అన్నమయ్య జిల్లా

కష్ట సమయంలో నేనున్నానంటూ..

కోడూరు-3 సచివాలయానికి చెందిన వలంటీరు కొండల విజయ్ తన పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వం సేవలు అందించడంలో ముందున్నాడు. పట్టణంలోని నరసరాంపేట వద్ద నివాసముంటున్న వాడ్యా రేఖానాయక్ వెన్నెముకకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ కొద్ది నెలల కిందట చికిత్స కోసం తిరుపతి సంకల్ప ఆస్పత్రిలో చేరాడు. ఆ సమయంలో వలంటీరు విజయ్ తిరుపతికి వెళ్లి రేఖా నాయక్‌కు పింఛను అందజేశాడు. ఆస్పత్రిలో ఉన్న రేఖానాయక్ ఖర్చులకు ఆ సొమ్ము ఎంతో ఉపయోగపడింది.



తిరుపతి సంకల్ప ఆస్పత్రిలో రేఖానాయక్‌కు పింఛను అందిస్తున్న వలంటీరు విజయ్

– రైల్వేకోడూరు అర్బన్

అండగా నిలిచాడు

వెన్నెముక సమస్యతో తిరుపతిలోని ఆస్పత్రిలో చేరాను. పింఛను తీసుకోవడానికి సొంతూరికి రాలేకపోయాను. నేను ఆస్పత్రిలో ఉన్నట్లు మా వలంటీరు విజయ్ తెలుసుకున్నాడు. తిరుపతిలోని ఆస్పత్రికి వచ్చి పింఛను సొమ్ము అందించాడు. ఆస్పతి ఖర్చులకు ఆ డబ్బు ఎంతగానో ఉపయోగపడింది.

- వాడ్యా రేఖానాయక్, రైల్వే కోడూరు

అంగవైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా..



గొంగటి వెంకటయ్యకు పింఛను అందిస్తున్న వలంటీరు వెంకట సుబ్బయ్య

ఇతడి పేరు కడప వెంకట సుబ్బయ్య, ఒంటిమిట్ట మండలం, సాలాబాద్ సచివాలయ పరిధిలో వలంటీరుగా సేవలందిస్తున్నాడు. కరోనా సమయంలో గొంగటి వెంకటయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో తిరుపతిలోని స్విమ్స్‌లో చేరాడు. అక్కడ చికిత్స పొందుతున్న వెంకటయ్యకు పింఛను అందించి ఆదుకోవాలని వలంటీరు వెంకట సుబ్బయ్య కరోనాను, తనకు ఉన్న అంగవైకల్యాన్ని కూడా లెక్క చేయకుండా తిరుపతి స్విమ్స్‌కు వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతున్న గొంగటి వెంకటయ్యకు పింఛను అందించాడు.

– ఒంటిమిట్ట

వలంటీరు మేలు మరువలేను



కరోనా సమయంలో అనారోగ్యంతో నేను స్విమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఆ సమయంలో మా వలంటీరు ఆస్పత్రికి దేవుడిలా వచ్చి నాకు పింఛను అందించాడు. ఆయన చేసిన మేలును మరచిపోలేను.

-గొంగటి వెంకటయ్య, సాలాబాద్, ఒంటిమిట్ట మండలం

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



లక్కిరెడ్డిపల్లె: గంగమ్మ దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



సంబేపల్లె: దర్శనమిస్తున్న దేవరరాయి నల్లగంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తులతో కిక్కిరిసిన గంగమ్మ ఆలయం

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ ఆలయానికి ఆదివారం వేలాది మంది భక్తులు వచ్చారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజులు భక్తులకు క్యూలైన్ల ద్వారా దర్శనాన్ని కల్పించారు. లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పర్యవేక్షణ చేపట్టారు. ఆలయ పూజారులు ఆది మూలం చంద్ర, రెడ్డి శేఖర్‌లు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు.

ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌ను నిషేధించాలి

రాయచోటి అర్బన్ : ఆన్‌లైన్ యాప్‌లను నిషేధించాలంటూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీ పోరాటానికి శ్రీకారం చుట్టినట్టు ఆ సంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఏఐవైఎఫ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ యాప్‌ల వలన యువత చెడుదారి పడుతోందన్నారు. ఆన్‌లైన్‌లో క్రికెట్‌తోపాటు కొత్తకొత్త గేమ్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బెట్టింగ్‌లు కడుతూ యువత సమయాన్ని, డబ్బును వృథా చేసుకుంటోందన్నారు. యాప్‌ల నిర్వాహకులు రకరకాల పేర్లతో యాప్‌లను రూపొందిస్తూ యువతను పలురకాలు మోసం చేస్తున్నారన్నారు. ఆన్‌లైన్ యాప్‌లను నిషేధించాన్న డిమాండ్‌తో అవగాహన కార్యక్రమాలు, కార్యాలయాల ఎదుట ధర్నా కార్యక్రమాలు దశలవారీగా చేపట్టనున్నట్లు తెలిపారు. యువత పోరాటాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నేతలు తరుణ్, కదిరప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కల వెంకటేష్

28న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

పెనగలూరు : నల్లపరెడ్డిపల్లిలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఈనెల 28న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పీర్ల పండుగను పురస్కరించుకొని 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి బండలాగుడు పోటీలు ప్రారంభిస్తామని వారు తెలిపారు. మొదటి బహుమతికి రూ. 60 వేలు, రెండో బహుమతికి రూ. 40 వేలు, మూడో బహుమతికి రూ. 30 వేలు, నాల్గో బహుమతికి రూ. 20 వేలు, ఐదో బహుమతికి రూ. 10 వేలు చొప్పున నగదు అందించనున్నట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలకు 9550532006, 7997226563, 9490770475 నెంబర్లు ద్వారా సమాచారం పొందవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

విలువలతో కూడిన విద్యను బోధించాలి

రాయచోటి టౌన్ : విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు బోధించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కె.రమణారెడ్డిలు అన్నారు. ఆదివారం పదోన్నతిపై బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు సాధారణమేనని అయితే ఎక్కడికి వెళ్లినా బోధనతో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఆ సంఘం నాయకులు రవీంద్ర రాజు, రామాంజనేయ రెడ్డి, నాగేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆపస్ నాయకులు

జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి రోప్‌స్కిప్పింగ్ జట్టు ఎంపిక జరిగింది. జిల్లా రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. అండర్-10,12,14,16 జట్లకు వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు వచ్చారు. కార్యక్రమానికి ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, అసోసియేషన్ కార్యదర్శి శరత్, పీడీ సుధాకర్‌లు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30న కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ సుధాకర్ తెలిపారు.

జగన్ పాలనకు వంద శాతం మార్కులు

- సమస్యల పరిష్కారానికి మార్గం తెలియజేస్తూ ముందుకు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ప్రభుత్వ పాలనకు ప్రజలు వందశాతం మార్కులు వేస్తున్నారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధితో జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. హామీలను నెరవేర్చడంలో దేశానికే జగనన్న పరిపాలన ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఆదివారం పట్టణంలోని 20, 21వార్డులలో 3వరోజు గడప గడపకు కార్యక్రమంలో భాగంగా శ్రీకాంత్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లారు. తిరిగి పథకాల గురించి వివరిస్తూ, అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి తదితరులతో కలసి శ్రీకాంత్‌రెడ్డి చంద్రవీధి, నాయక్‌వీధి, బాలాజీవీధి, మానస రెస్టారెంటు -1,2 వీధులు, రాజుస్కూల్ వెనుక వీధి, విఘ్నేశ్వరకాలనీ, ఎల్ఐసీ కాలనీలలో గడప గడపకు వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకుంటూ వారితో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరిస్తూ, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందనివారికి ఎట్టి పరిస్థితులలోనూ పథకాలు అందేలా చూడాలంటూ ఆయన అధికారులను ఆదేశించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారంటూ చెప్పారు.

ఇంటింటా జననీరాజనం

పట్టణంలోని 20, 21వార్డులలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమం పండుగలా సాగింది. ప్రతి గడపలోనూ శ్రీకాంత్‌రెడ్డికి నీరాజనం పలికారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ పనితీరు బాగుందా ? అంటూ ప్రశ్నిస్తుంటే జగనన్న పాలన బేషుగ్గా ఉందని ప్రజలు కితాబిచ్చారు. అర్హత ఉంటే దళారులు లేకుండా పథకాల ఫలాలు నేరుగా తమకు అందుతుండడం సంతోషంగా ఉందంటూ లబ్ధిదారులు శ్రీకాంత్‌రెడ్డికి తెలిపారు.

హాకీ క్రీడాకారులకు చేయూతనందిస్తా

నియోజకవర్గంలోని హాకీ క్రీడాకారులకు చేయూతనందిస్తానని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాజుస్కూల్ ఎదురుగా హాకీ కోచ్, దిశ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న హాకీ క్రీడాకారులను శ్రీకాంత్‌రెడ్డి పరిచయం చేసుకున్నారు. విద్యార్థులు, యువత చదువుతోపాటు క్రీడలపై మక్కువను పెంచుకోవాలన్నారు. రాయచోటి పట్టణంలో జూనియర్ కళాశాల ఆవరణలో క్రీడా ప్రాంగణాన్ని శిక్షణకు ఉపయోగించుకోవాలంటూ వారికి సూచించారు. నక్కావాండ్లపల్లెకు సమీపంలో నిర్మితమవుతున్న క్రికెట్ స్టేడియం పనులు పూర్తిచేసుకుని త్వరలో అందుబాటులోకి వస్తుందంటూ క్రీడాకారులకు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. హాకీలో ఉత్తమ ప్రతిభను కనబరచి రాయచోటికి మంచిపేరును తీసుకురావాలంటూ శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, వైస్ ఎంపీపీ జయపాల్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు కె.వి.నరసింహారెడ్డి, జానం రవీంద్ర, షబ్బీర్, పల్లపు రమేష్, విజయభాస్కర్, అమరనాథరెడ్డి, అనిల్‌రెడ్డి, పల్లా రమేష్, గంగిరెడ్డి ఆనందరెడ్డి, మాధవరం రమేష్‌రెడ్డి, డీలర్ నాగేంద్ర, దిన్నెపాడు రవిరాజు, మానవత బ్రహ్మానందరెడ్డి, లక్ష్మికర్‌రెడ్డి, షరిడీసాయి మహిళా కళాశాల డైరెక్టర్ మనోజ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కో-ఆప్షన్ అయ్యవారురెడ్డి, ఖాదర్‌వలి, బార్ సిద్దారెడ్డి, గువ్వల బుజ్జిబాబు, కొత్లపల్లె ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ సంఘం వార్షికోత్సవం

చిట్వేలి : శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రైల్వేకోడూరు నియోజకవర్గస్థాయి బ్రాహ్మణ సంఘం 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, సహస్రనామార్చనలు నిర్వహించారు. రైల్వేకోడూరు పట్టణంలో ఉన్న శంకరమఠం నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. అలాగే ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చిందుకూరి నరసింహ శర్మ, స్థానిక ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, వెంకటరమణ, సంఘం నాయకులు సతీష్ స్వామి, కోనంగి అరవింద్, సురేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. మిస్పా మూవీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.

విద్యతోపాటు ఉపాధి కల్పనకు కృషి

రాజంపేట : రాజంపేట, తిరుపతి, కడప ఏబీటీఎస్ విద్యాసంస్థలు నిర్వహించిన అవగాహన సదస్సులకు విశేష స్పందన లభించింది. ఆదివారం కర్నూలు పట్టణంలోని సూరజ్‌గ్రౌండ్, బస్టాండు రోడ్డు, బళ్లారి చౌరస్తా రోడ్, హనుమడి గుడి ఎదురుగా, ఇందిరా నగర్‌లలో నిర్వహించిన ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యపై అవగాహన సదస్సులకు స్పందన లభించిందని రాజంపేట ఏబీటీఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఏబీటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డిలు మాట్లాడుతూ ఏబీటీఎస్ ఇంకా మరికొన్ని ప్రాంతాల్లో విద్యార్థుల కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కర్నూలు సదస్సులో వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి వివిధ కోర్సులు, బ్రాంచిల ప్రాధాన్యత, కళాశాల ఎంపికలో పాటించాల్సిన మెళకువలను వివరించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్ క్వాలిటి పెంచుకోవడం లాంటివి ఎంతైనా విద్యార్థులకు ఉపయుక్తమని పేర్కొన్నారు. అలాగే రాజంపేట ఏబీటీఎస్ ప్రొఫెసర్ డా.సుబ్బారావు మాట్లాడుతూ విద్యతో ఉపాధి చూపించే దిశగా ఏబీటీఎస్ కృషి చేస్తుందన్నారు. ఆ దిశగా విద్యార్థులను పోటీ వాతవరణంలో తట్టుకొని విజేతగా నిలిచే పరిస్థితులను కల్పిస్తుందన్నారు.



ఏబీటీఎస్ సదస్సులో మాట్లాడుతున్న డా.సుబ్బారావు

జంబుకేశ్వరుడికి పూజలు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలో జంబుకోన అటవీ ప్రాంతలో వెలసిన జంబుకేశ్వరుడికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించామని పరిశోధకుడు మునికుమార్ తెలిపారు. ప్రకృతి అందాలు ఈ ప్రాంత అభివృద్ధికి అధికారులు, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.



జూదరుల అరెస్టు

రామాపురం : పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ పరిధిలోని కంపపాదల్లో ఆదివారం జూదం ఆడుతున్నట్లు సమాచారంతో ఎస్ఐ కొండారెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు చేసి పేకాట ఆడుతున్న నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీలకు చెందిన తురక రాజ, దేరంగుల చంద్రశేఖర్, తిరుపతి ఆంజనేయులు, బండారు వెంకటేశు, తిరుపతి శివయ్యలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.7,960లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.